క్లుప్తంగా

6న జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 6వ తేదీన పాలకొండలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నుండి 28 ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 6వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పాలకొండ తమ్మి నాయుడు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 11 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను కంపెనీలోకి ఎంపిక చేసుకోవడం జరుగుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు 6301275511, 7993795796లో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పార్వతీపురం టౌన్: జిల్లాలో ప్రభుత్వ మరియు ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు అధికారి నగేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్ర పరీక్షలు నిర్వహించి దృష్టి దోషం వున్న విద్యార్థులకు ఉచితంగా కళ్ళద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. 15 మంది విద్యార్థులకు దృష్టి దోషం వున్నట్టు గుర్తించి వారికి త్వరలో కళ్ల జోళ్లు పంపిణీ చేస్తామన్నారు. నేత్ర వ్యాధులు – వాటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి కృష్ణారావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి వ్రతాలు



స్వామివారి పూజల్లో పాల్గొన్న భక్తులు

సాలూరు: పాచిపెంట మండలంలోని పనుకువలస గ్రామంలో శనివారం సామూహిక వేంకటేశ్వర వ్రతాలు నిర్వహించారు. సనాతన ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి మహత్యాన్ని వివరిస్తూ, వ్రతాన్ని జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని పూజించారు. దీనితో స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన వాతావరణం నెలకొంది.

రైతు సంక్షేమమే లక్ష్యం



అన్నదాత సుఖీభవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్

సీతానగరం: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. మండలంలోని గుచ్చిమిలో ఏవో ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో శనివారం రైతు సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు రూ.18.06 లక్షల లబ్ధి చేకూరుతుందన్నారు. దీనికి సంబంధించిన చెక్కును విడుదల చేశారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్, రైతు నాయకులు పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలపై ఆందోళన



నిరవధిక నిరాహార దీక్షలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పార్వతీపురం: విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయ గేటు వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు రెండో రోజు శనివారం కూడా కొనసాగాయి. దీనికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మద్దతు తెలిపారు. దీక్షలో పాల్గొన్న వారికి ఆరోగ్యం స్వల్పంగా క్షీణించడంతో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. నేటి ప్రభుత్వ విధానాలు విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ నాయకులు వి.దాలినాయుడు, పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.శ్రీమరి, సీహెచ్ చంద్రరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.అనిల్, టి.అఖిల్, కె.డేవిడ్, సంధ్య, సురేష్, గంగరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం వైఎస్సార్‌సీపీ అలుపెరగని పోరాటం

- మాజీ ఎమ్మెల్యే జోగారావు



పెదపెంకిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, నాయకులు



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, నాయకులు

బలిజిపేట: వైఎస్సార్ సీపీ అధికారంలో లేకపోయినా అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మెడలు వంచి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయించడంలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజల పక్షాన నిలిచి పోరాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పెదపెంకిలో చంద్రబాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రజలకు అన్ని విధాల అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారిని మోసపరుస్తూ, అణగదొక్కే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటూ సంక్షేమ పాలన అందించాలే తప్ప ఇలా మోసం చేయడం తగదన్నారు. ఎన్నికల వేళ కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలుకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. రాష్ట్రంలో కూటమి నేతల అరాచక పాలన కొనసాగుతోందన్నారు. దీన్ని ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. కూటమి పాలనలో సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఉద్యోగ నియామకాలు నిలిచిపోయాయన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదన్నారు. 50 సంవత్సరాలు పైబడిన వారికి ఇస్తామన్న పింఛన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పాపారావు, ఎంపీపీ నాగమణి, రాష్ట్ర మహిళా కార్యదర్శి, ఎంపీటీసీ సునీత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి టి.ప్రసాదరావు, మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిఎస్ఆర్.నాయుడు, రైతు విభాగం మండల శాఖ అధ్యక్షుడు జి.సత్యన్నారాయణ, సిహెచ్.సత్యం, జి.అప్పలనాయుడు మాస్టారు, జగన్, శ్రీనివాసరావు, బి.సత్యన్నారాయణమూర్తి, పి.రామకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వం

సీతానగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములునాయుడు అన్నారు. పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు శనివారం చెల్లన్నాయుడువలసలో యువజన విభాగం మండల అధ్యక్షుడు దాసరి కిషోర్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు దాసరి నాగరత్నం, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర నాయకులు ఆర్వీ పార్థసారధి, ఎం.ధనుంజయ్, బంకురు శంకరరావు, సర్పంచ్‌లు బొన్నాడ తిరుపతిరావు, కె.శ్రీనివాసరావు, జి.దాసు, మండల నాయకులు ధనంజయయ్, జె.శ్రీకాంత్, చప్ప ఉమా, సురేష్‌కుమార్, వై.గోపాల్, కొట్నాన లలిత, వి.వేణు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం సభ్యులు పాల్గొన్నారు.



పార్వతీపురం రూరల్: 7, 8 వార్డుల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు



పార్వతీపురం రూరల్:సూడిగాంలో ఇంటింటికి వంచన కరపత్రాన్ని ఇచ్చి గ్రామస్తులతో మాట్లాడుతున్న మండల పార్టీ నాయకులు

బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమానికి విశేష స్పందన

పార్వతీపురం రూరల్: పట్టణంలోని 7, 8 వార్డులలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమానికి విశేష స్పందన కన్పించింది. పట్టణ నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వార్డుల్లో గల వీధుల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాన్ని ఎత్తిచూపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోన్ గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, పట్టణ ఉపాధ్యక్షుడు ఓలేటి గోవింద, చందాన ఆనంద్, కౌన్సిలర్లు సువ్వాడ లావణ్య, సుధీర్, వి.నేతాజీ, స్థానిక వార్డు ఇన్‌చార్జ్‌లు జి.గాయత్రి, పాత గౌరీశంకరరావు, బాబూరావు, లక్ష్మీనారాయణ, ఎద్దు రవి, నియోజకవర్గ అనుబంధ విభాగ నాయకులు ముగడ జగన్‌మోహనరావు, పాత గౌరీశంకరరావు, దేవుపల్లి నాగరాజు, ఎస్.అనిల్, కాగాన ప్రకాష్, కె.శేఖర్, సీనియర్ నాయకులు జి.లక్ష్మి, జి.ప్రభావతి, చింతగడ లక్ష్మి, ఎస్‌వీఎస్ఎన్ రెడ్డి, భోను ఆదినారాయణ, బి.రాజు, కె. చిట్టి, పి.రాము, రమణ, ఉమాదేవి, రాధ, బి.శ్రీనివాసరావు, డి.గురుమూర్తి, ఎస్.చంద్ర, కె.చిట్టి, బి.నాగరాజు, ఎస్.శ్రీను, రెడ్డి, కిరణ్, గౌరునాయుడు, ఎస్.నారాయణరావు, బి.భాస్కరరావు, బి.గణేష్ గణపతి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం మోసమే..

మండలంలోని సూడిగాం గ్రామంలో మండల నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ మజ్జి శోభారాణి, మజ్జి శేఖర్, బలగ నాగేశ్వరరావు, యాంద్రాపు తిరుపతినాయుడు, మడక విశ్వనాధం, యాళ్ల ప్రతాప్, సర్పంచ్ గండి శంకరరావు, వైస్ ఎంపీపీ బంకురు రవికుమార్, పెండ రమణ, బీవీ వెంకటరమణ, బంకపల్లి వాసుదేవరావు, ముప్వల సత్యం నాయుడు, ఎంపీటీసీ కృష్ణ, శ్రీరాములు, ఎంపీటీసీ బడే రామారావు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు తదితరులు

మితిమీరిపోతున్న ఎమ్మెల్యే విజయచంద్ర ఆగడాలు

- ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే చిరుద్యోగుల తొలగింపు
- కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్న అధికారులు
- ఎమ్మెల్యే తీరుపై సీఎంకు ఫిర్యాదు చేస్తాం..
- సీఐటీయూ నాయకులు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాజకీయ వేధింపులు, చిరుద్యోగుల అక్రమ తొలగింపులు పెరిగాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బోనేల విజయచంద్ర ఆగడాలు రోజు రోజుకు మితిమీరి పోతున్నాయన్నారు. అకారణంగా చిరుద్యోగులు తొలగింపులకు పాల్పడుతున్నారన్నారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ బలిజిపేట మండలం అరసాడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపు, పార్వతీపురం మున్సిపల్ కొత్తవలస ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపు అన్నారు. ఈ తొలగింపులకు ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర కారణమని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో చట్టాలకు కట్టుబడి ఉండాల్సిన అధికారుల సైతం ఎమ్మెల్యేకు ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా అధికార కూటమి నేతలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు తమ ధోరణి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే తరహాలో జిల్లాలోని సాలూరు మండలం కరాసవలస కేజీబీవీ సిబ్బందిని అక్కడ మంత్రి సంధ్యారాణి రాజకీయ కారణాలతో తొలగించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ధోరణి మార్చుకోకపోతే నేరుగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తొలగించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే న్యాయ పోరాటానికి సిద్ధపడతామని తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, సీఐటీయూ పట్టణ కన్వీనర్ బి.సూరిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించి, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



స్మార్ట్ మీటర్లు వలన కలిగే ప్రమాదాలను ప్రజలకు వివరిస్తున్న సీపీఎం నేతలు

సాలూరు: విద్యుత్ చార్జీలు తగ్గించి, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్మార్ట్ మీటర్ల వలన కలిగే నష్టాన్ని, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని వివరిస్తూ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎన్‌వై నాయుడు తదితరులు పట్టణంలో పలు వార్డుల్లో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు విద్యుత్ భారాలు వేసే విధంగా ఈ స్మార్ట్ మీటర్లను తీసుకువచ్చారన్నారు. ప్రజలపై భారాలు వేసే ఈ ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించి సీపీఎంతో కలిసి పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ స్మార్ట్‌మీటర్లు బిగించడానికి వ్యక్తిగత అంగీకారం అవసరమని కావున ప్రజలంతా వీటిని వ్యతిరేకించి నిరసన తెలియజేయాలన్నారు. ఈ మేరకు ఈ నెల 5న విద్యుత్ కార్యాలయాల వద్ద చేపట్టే ధర్నాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాముడు, స్వప్న, దేవి, సీత తదితరులు పాల్గొన్నారు.

తిరుమాలాచార్యులకు ఘన నివాళులు



తిరుమాలాచార్యుల భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలో శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్న ఉపాధ్యాయుడు, ప్రముఖ వ్యాఖ్యాత, రచయిత, కవి జెబి.తిరుమలాచార్యుల మృతదేహం వద్ద కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర వేర్వేరుగా నివాళులు అర్పించారు. శుక్రవారం రాత్రి గుండెపోటుతో తిరుమలాచార్యులు మరణించారు. శనివారం ఉదయం కలెక్టర్, మాజీ డిప్యూటీ సీఎంతో పాటు పలువురు ప్రముఖులు తిరుమలాచార్యులు ఇంటికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబీకులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సాహితీ రంగంలో ఆయన లేని లోటు ఎవరు పూడ్చలేనిదన్నారు.

పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుదాం..



బొర్రా చిన్నా విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

సాలూరు: పీడిత ప్రజల తరపున పోరాడిన దివంగత కమ్యూనిస్ట్ నేత బొర్రా చిన్న(వెంకటరాజు) పోరాట స్ఫూర్తితో బలమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మిద్దామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న అన్నారు. పట్టణంలో వైఎస్సార్ కూడలి వద్ద గల బొర్రా చిన్న విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొర్రా చిన్నాను ఆదర్శంగా తీసుకుని సాలూరులో కమ్యూనిస్టు పార్టీ తరపున ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో రోడ్లు, రిజర్వాయర్లు తదితర అనేక సమస్యలున్నాయన్నారు. ప్రజలు వలస బాట పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 8, 9 తేదీలలో పాలకొండలో నిర్వహించనున్న జిల్లా మహాసభల్లో పాల్గొని చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లా మహాసభలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వాహన దారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ

పార్వతీపురం రూరల్: మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని ఈగల్ టీం ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు పట్టణంలోని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యానికి హానికరమైన గంజాయి, మరికొన్ని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

అధ్యాపకులకు ఓరియంటేషన్ తరగతులు



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులను అన్ని విధాల సంసిద్ధం చేయడానికి ఓరియంటేషన్ తరగతులను నిర్వహించనున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు తెలిపారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఓరియంటేషన్ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరగతులు ప్రతీవారం చివరి పని దినం రోజు జరుగుతాయన్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులలో వారానికి ఒక సబ్జెక్టు చొప్పున ఈ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల మ్యాథ్స్ అధ్యాపకులకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారన్నారు. తరగతి గది బోధనా ప్రక్రియలను మెరుగుపరచడానికి సైన్స్ ఫ్యాకల్టీ సామర్థ్యాలను నిరంతరం అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మారిన సిలబస్ విద్యార్థులకు చక్కగా బోధించే నైపుణ్యాలను అధ్యాపకులంతా అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో 14 జూనియర్ కళాశాలల గణిత అధ్యాపకులు, పార్వతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు పాల్గొన్నారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

- డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు

పార్వతీపురం టౌన్: పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా జిల్లా ఆసుపత్రిలో డీఈహెచ్ఎస్ డాక్టర్ నాగభూషణరావు ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అక్కడ ఉన్న గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లిపాలలో బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పోషకాలు, విటమిన్లు ఉంటాయని, రోగ నిరోధక వ్యవస్థను బలపరచి పిల్లలు వ్యాధుల బారిన పడకుండా రక్షణ కల్పిస్తాయన్నారు. బిడ్డకు పుట్టిన గంటలోపే తల్లిపాలు తాగించాలని, ఇవి బిడ్డకు మొదటి సహజ టీకా అని పేర్కొన్నారు. బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. పాలు పట్టే సరైన విధానం, జాగ్రత్తలపై వివరించారు. ఈ నెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలను కొనసాగించాలని ప్రజల్లో అవగాహన పెంపొందించాలని వైద్య అధికారులు ,సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా. నాగభూషణరావు, డీఐవో డా.విజయమోహన్, జిల్లా ప్రోగ్రాం అధికారులు జగన్మోహనరావు, రఘు, కౌశిక్, వైద్యులు సంజీవ నాయుడు, లావణ్య, సూపర్‌వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యంలో పురుగులు



సన్నబియ్యంలో ఉన్న నల్లని పురుగులు

పార్వతీపురం రూరల్: ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తూ ఊదరగొట్టింది. అయితే ఆ సన్న బియ్యంలో పురుగులు పరుగులు పెడుతూ కనబడుతున్నాయి. పార్వతీపురం మండలంలోని కొత్తపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సన్నబియ్యం బస్తాను తెరవగా నల్లని పురుగులు అందులో పరుగులు పెడుతూ కన్పించాయి. ఈ మేరకు మధ్యాహ్న భోజన సిబ్బంది చేసేది ఏమీలేక బియ్యంలో ఉన్న పురుగులను వేరు చేసేందుకు అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపంతో ఇలాంటి ఘటనలు చాలా చోటు చేసుకుంటున్నాయి. విద్యార్థులకు ప్రభుత్వ రంగ సంస్థల్లో మౌలిక వసతులు, మెరుగైన విద్య అందించే విషయంలో విఫలమవుతున్నారని ఇలాంటి ఘటనలతో తేటతెల్లమవుతుంది.

ప్రమాదం జరిగితే కానీ స్పందించరా...

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రం ప్రారంభంలో శక్తి నగర్ సమీపంలో ఉన్న అంతర్‌రాష్ట్ర రహదారిపై గతంలో కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు వద్ద అంతర్‌రాష్ట్ర రహదారి సగానికి కల్వర్టు వద్ద శిథిలావస్థకు చేరి కుంగిపోయి దఫదఫాలుగా పెద్ద గొయ్యిగా మారింది. అయితే సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు ఆ చోట ఓ గోడను నిర్మించారు. గోడ నిర్మాణంతో అంతర్‌రాష్ట్ర రహదారిపై గోడ నిర్మాణం ఏంటని వాహన దారులు, స్థానికులు విస్తుపోగా ఇటీవల ఆ గోడ గుర్తు తెలియని వాహనాలు అనేక మార్లు ఢీకొట్టడంతో గోడ శిథిల భాగాలన్నీ కల్వర్టు గొయ్యిలో పడ్డాయి. ఈ మేరకు రహదారి ఆ ప్రాంతంలో మరింత ఇరుగ్గా మారింది. రాత్రి సమయాల్లో ఆదమరిస్తే ప్రమాదాన్ని వాహనదారులు ఎదుర్కొక తప్పదనే పరిస్థితులు అక్కడ నెలకొన్నాయి. ఎన్నోమార్లు ఈ సమస్యకు సంబంధించి కథనాలు ప్రచురితమైనా సంబంధిత అధికారులు స్పందన కరువయ్యింది.



ప్రమాదకరంగా మారిన శక్తినగర్ వద్ద ఉన్న అంతర్‌రాష్ట్ర రహదారి

జర్మన్ భాషపై ఉచిత శిక్షణ

పార్వతీపురం:

జిల్లాలోని గిరిజన నర్సింగ్ గ్రాడ్యుయేట్స్‌కు జర్మన్ భాషపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఐరోపా దేశాల్లో నర్సింగ్ గ్రాడ్యుయేట్స్‌కు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ మేరకు ఉపాధికి అవసరమైన జర్మన్ భాషను నేర్చుకొనేందుకు 8 నుంచి 10 నెలలు పాటు విశాఖపట్నంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలతో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. 35ఏళ్లలోపు ఉన్న బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి రెండేళ్ల క్లినికల్ అనుభవంతో ఏపీ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ కలిగి వున్న మహిళలు అర్హులన్నారు. ఇటీవల బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసుకున్న వారు కూడా అర్హులన్నారు. ఆసక్తి అర్హత ఉన్నవారు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తులను పార్వతీపురంలోని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులకు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.